

విరుదాచలం సమీపంలోని వేప్పూరు తిరుప్పయర్‌లో 'తల్లిదండ్రులను గౌరవిద్దాం' కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

ఓ వైపు పొగుడుతూ... మరో వైపు

నిధులు ఇవ్వనంటారా?

కేంద్రంపై మండిపడ్డ సీఎం స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు విద్యారంగంలో దేశంలో తమిళనాడు ముందంజలో ఉందని, విద్యలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నారని, అందరికీ నాణ్యమైన విద్యనందిస్తున్నారంటూ పొగడుతున్న కేంద్రప్రభుత్వం.. రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఇవ్వకపోవడంపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కడలూరు జిల్లా వేప్పూరు తిరుప్పయర్‌లో శనివారం ఉదయం పాఠశాల విద్యాశాఖ, రాష్ట్ర తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 'తల్లిదండ్రులను గౌరవిద్దాం' పేరుతో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 132 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.177.38 కోట్ల వ్యయంతో నిర్మించిన తరగతి గదులు, లేబొరేటరీలు, రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను ఆయన ప్రారంభించారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో 'అప్పా' పేరుతో ప్రత్యేక యాప్‌ను, ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి సమగ్రమైన వివరాలను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అందించారు. పిల్లల చదువులకు తల్లిదండ్రులు ఎలా సహకరించాలో, వారిని ఎలా ప్రోత్సహించాలో ఈ సభాముఖంగా ప్రముఖులు ప్రసంగాల ద్వారా తెలియజేశారు.

విద్యను రాజయకీం చేయడమా?

ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ... విద్యను రాజకీయం చేయడంలో కేంద్రం ఆరితేరిందని, బ్లాక్ మెయిల్ రాజకీయాలను సైతం పుణికిపుచ్చుకుందన్నారు. జాతీయ విద్యావిధానాన్ని అమలు చేస్తేనే చెల్లించాల్సిన నిధులను విడుదల చేస్తామని రాష్ట్రాన్ని బెదిరిస్తోందన్నారు. జాతీయ విద్యావిధానం అమలైతే పేద, బలహీన వర్గాలకు చెందినవారంతా విద్యకు దూరమవుతారన్నారు. మూడో తరగతి నుంచే పబ్లిక్ పరీక్షలు రాయాల్సి ఉంటుందని, ఉత్తీర్ణతా శాతం తగ్గుతుందని, కులవృత్తులకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన కోర్సుల్లో చేరలేరని అన్నారు. ఏ భాషనూ డీఎంకే వ్యతిరేకించదని, రాష్ట్రంలో హిందీ భాషను చదివేందుకు అడ్డుపడడం లేదన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో, కేంద్ర ప్రభుత్వం నడిపే పాఠశాలల్లో హిందీ చదివేవారు ఎక్కువగానే ఉన్నారని, ఆ భాషను నిర్బంధంగా అమలు చేయడాన్నే సహించబోమన్నారు. ఇతర రాష్ట్రాలన్నీ జాతీయ విద్యావిధానాన్ని అమలు చేస్తుంటే డీఎంకే ప్రభుత్వం ఎందుకు వ్యతిరేకిస్తోందని కేంద్రం ప్రశ్నిస్తోందని, ఈ రాష్ట్రం విద్యాపరంగా అగ్రస్థానంలో ఉండటం వల్ల త్రిభాషా విద్యావిధానాన్ని, హిందీ భాషను నిర్బంధంగా అమలు చేయాల్సిన అవసరం లేదన్నారు. దేశంలో గత 75 యేళ్లలో సుమారు 52 ప్రాంతీయ భాషలు అంతరించిపోయాయని, ప్రత్యేకించి 'హిందీ బెల్ట్' అని పిలువబడే రాష్ట్రాల్లో సుమారు 25 ప్రాంతీయ భాషలు కనుమరుగయ్యాయని గుర్తు చేశారు. అలాంటి దుస్థితి తమిళభాషకు రాకూడదనే జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రవాసులు వ్యతిరేకిస్తున్నారని స్టాలిన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్ముడి, ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, ఎస్ఎస్ శివశంకర్, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, సీవీ గణేశన్, ఎంపీ విష్ణు ప్రసాద్, శాసనసభ్యులు రాధాకృష్ణన్, రాజేంద్రన్, అయ్యప్పన్, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్తుకుమార్, ప్రభుత్వ పాఠ్య పుస్తకాల సంస్థ అధ్యక్షుడు దిండుగల్ లియోని, పాఠశాలల విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రమోహన్, కడలూరు జిల్లా కలెక్టర్ సీబీ ఆదిత్య సెందిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్‌షోలో స్టాలిన్...

రెండు రోజుల పర్యటన నిమిత్తం కడలూరుకు వెళ్లిన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు డీఎంకే స్థానిక శాఖ నాయకులు, పార్టీ శ్రేణులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. శనివారం ఉదయం నైవేలిలో ఎన్నెల్సీ అతిథిగృహం నుంచి వేప్పూరు తిరుప్పయర్ ప్రాంతంలో 'తల్లిదండ్రులను గౌరవిద్దాం' కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరారు. కొద్ది దూరం వెళ్లాక రోడ్డుకు ఇరువైపులా తన రాక కోసం వేచి ఉంటున్న స్థానికులను చూసిన స్టాలిన్ కారు నుంచి దిగి కాలినడకన పయనమయ్యారు. సుమారు రెండు కిలోమీటర్లు రహదారికి ఇరువైపులా నిలిచిన వారితో కరచాలనం చేస్తూ, సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. నెహ్రూ విగ్రహం కూడలి, పెరియార్ స్క్వేర్, ఎంజీఆర్ విగ్రహం కూడలి, సెంట్రల్ బస్‌స్టేషన్, ఎనిమిది రహదారుల కూడలి తదితర ప్రాంతాల్లో స్థానికులు, పార్టీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అదే సమయంలో స్థానికులు అందించిన వినతి పత్రాలను కూడా స్వీకరించారు.



సెల్వపెరుందగైకు జ్ఞాపిక అందజేస్తున్న నేతలు

నాపైనే నిందలా?

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్న సెల్వపెరుందగై

ప్యారీస్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధి కోసం అహరహం కృషి చేస్తున్న తనపైనే నిందలేస్తే ఎలాగని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని ఛేదించి పార్టీ బలోపేతానికి తాను ప్రయత్నిస్తానని ఆయన పేర్కొన్నారు. స్థానిక రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో శనివారం పార్టీ అధ్యక్ష పదవి చేపట్టి రెండో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సెల్వపెరుందగైను అభినందిస్తూ పార్టీ సీనియర్ నేతలు నాసే రామచంద్రన్, ఎస్.రంగభాష్యం, జ్యోతి తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సెల్వపెరుందగై కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ... ఘనచరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ బాటలో ముందుకు తీసుకెళ్లేందుకు తనకు సహకరిస్తున్న వారికి రుణ పడి ఉంటానని అన్నారు. తాను టీఎన్‌సీసీ అధ్యక్ష పదవి చేపట్టాక రాష్ట్రవ్యాప్తంగా మూడు సార్లు పర్యటించానని, త్వరలోనే నాల్గో పర్యటన చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామ కమిటీల ఏర్పాటు పనులు 46 శాతం పూర్తయ్యాయని, వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దీటుగా ఎదుర్కొనేలా పార్టీలోని అన్ని అనుబంధ శాఖల నిర్వాహకులతో చర్చించి ప్రచారం ఏ విధంగా ఉండాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. తానంటే గిట్టని కొందరు నాయకులు ఢిల్లీకి వెళ్లి పార్టీ అధిష్ఠానం వద్ద తనపై ఫిర్యాదు చేస్తారని తాను ఊహించలేదని, అయితే పార్టీ పెద్దలు తీసుకొనే చర్యలకు తాను కట్టుబడి ఉంటానని ఆయన స్పష్టం చేశారు.

26న టీవీకే సర్వసభ్య సమావేశం

2 వేలమందికి ఆహ్వానం ● ముమ్మరంగా ఏర్పాట్లు



ప్యారీస్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) సర్వసభ్య సమావేశం ఈ నెల 26న మహాబలిపురంలో జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు 2,000 మంది పార్టీ ప్రముఖులకు ఇప్పటికే ఆహ్వానాలు అందాయి. ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశం సందర్భంగా విజయ్ 2026 అసెంబ్లీ ఎన్నికల ప్రణాళికలను, రాష్ట్రవ్యాప్త పర్యటన షెడ్యూల్‌ను ప్రకటిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో ఏళ్ల తరబడి డీఎంకే, అన్నాడీఎంకే మధ్యే ప్రత్యక్ష పోటీ నెలకొంటోంది. ఈ రెండు పార్టీలు వంతులవారీగా మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ వస్తున్నాయి. అయితే ఇటీవల రాష్ట్ర రాజకీయాల్లో మార్పులు జరుగుతున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలో ఏర్పాటైన తృతీయ ఫ్రంట్ బరిలో దిగింది. ఇన్నాళ్లు రాజకీయాలకు దూరంగా ఉన్న నటుడు విజయ్ 2024 ఫిబ్రవరి 2న టీవీకేని ప్రారంభించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి గుర్తింపు పొంది పార్టీ జెండాను కూడా ఆయన పరిచయం చేశారు. విల్లుపురం జిల్లా విక్రవాండిలో పార్టీ తొలి మహానాడును విజయవంతంగా నిర్వహించి రాజకీయాల్లో తనకంటూ గుర్తింపు పొందారు. టీవీకేలో పార్టీపరంగా 120 జిల్లా శాఖలు రూపొందించి వాటిలో 95 జిల్లాలకు నిర్వాహకులను నియమించారు. ఈ నేపథ్యంలో, ఈనెల 2వ తేదీతో పార్టీ ద్వితీయ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. 2026 అసెంబ్లీ ఎన్నికల లక్ష్యంగా విజయ్ పార్టీని ముందుకు నడిపిస్తున్నారు. కొత్త జిల్లా కార్యదర్శులను నియమించే పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో, మరోవైపు ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తో రాబోయే అసెంబ్లీ ఎన్నికల గురించి విజయ్ మంతనాలు జరుపుతున్నారు. ఇదిలా ఉండగా మహాశివరాత్రి పర్వదినమైన వచ్చే బుధవారం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం, ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. విజయ్ పాల్గొనే సభ కావడంతో ప్రజలు అధిక సంఖ్యలో గుమిగూడే అవకాశమున్నందువల్ల రద్దీ నియంత్రించే దిశగా 2,000 మంది మాత్రమే పాల్గొనేందుకు పాస్‌లు, ఫొటో గుర్తింపుకార్డులు పంపిణీ చేస్తున్నట్లు పార్టీ నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశం అనంతరం విజయ్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించేందుకు వ్యూహం రచించారు. రోజుకు నాలుగు జిల్లాల్లో పర్యటించి పార్టీ నిర్వాహకులతో సమావేశం కానున్నారు. అదే సమయంలో జిల్లాల్లో ఏర్పాటుచేయనున్న బహిరంగ సభల్లో కూడా విజయ్ ప్రసంగిస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.



విద్యార్థులకు నగదు అందజేస్తున్న సుబ్బారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు

పేద విద్యార్థులకు అండగా ఉంటాం

ఆస్కా అధ్యక్షుడు సుబ్బారెడ్డి ● 40 మంది విద్యార్థులకు నగదు అందజేత

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు అండగా ఉంటామని ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) అధ్యక్షుడు డాక్టర్ కె.సుబ్బారెడ్డి ప్రకటించారు. ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్నవారు తమను సంప్రదించాలని, అలాంటి వారికి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఫీజులు కట్టలేక ఏ ఒక్కరి విద్యాభ్యాసం మధ్యలో ఆగిపోకూడదనేది తమ ఉద్దేశమన్నారు. ఉత్తరమద్రాస్‌లోని మూడు పాఠశాలలకు చెందిన 40 మంది పేద విద్యార్థులకు ఆస్కా ట్రస్టు తరఫున రూ. 3 లక్షలు అందజేశారు. శనివారం సాయంత్రం స్థానిక టి.నగర్, విజయరాఘవరోడ్డులో ఉన్న ఆస్కా ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్‌గానూ ఉన్న డాక్టర్ సుబ్బారెడ్డి ఈ నగదును విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమానికి నేతృత్వం వహించిన ఆస్కా మేనేజింగ్ ట్రస్టీ పి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తమ పిల్లల ఫీజు కట్టలేకపోతున్నామంటూ పలువురు తనను సంప్రదించగానే ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. తన ప్రతిపాదనను ఆయన వెంటనే అంగీకరించారని తెలిపారు. పేద విద్యార్థులకు ఆస్కా ట్రస్టు ఎప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా ట్రస్టు కార్యదర్శి ఆదినారాయణ రెడ్డి తదితరులు కూడా పాల్గొన్నారు.

నాగై టు శ్రీలంక

● ప్రయాణికుల నౌకా సేవలు ప్రారంభం



జెండా ఊపి నౌకా సేవలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం - శ్రీలంక మధ్య ప్రయాణికుల నౌకా సేవలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. నాగై - కాంగేశన్ హార్బర్ మధ్య గత ఏడాది ఆగస్టు 15వ తేది 'శుభం' అనే ప్రయాణికుల నౌకా రవాణా సేవలు ప్రారంభమయ్యాయి. వారానికి ఐదు రోజులు రెండు మార్గాల్లో వెళ్తున్న నౌకలు, నైరుతి రుతుపవనాల నేపథ్యంలో భద్రత దృష్ట్యా తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ క్రమంలో ఈ నెల 12వ తేది నుంచి నౌకా సేవలు ప్రారంభమవుతాయని ప్రకటించగా, సాంకేతిక ప్రమాణ పత్రం అందకపోవడంతో తాత్కాలికంగా వాయిదా వేశారు. అన్ని అనుమతులు లభించడంతో శనివారం నాగపట్టినం హార్బర్ నుంచి 83మంది ప్రయాణికులతో నౌక కాంగేశన్ హార్బర్‌కు బయల్దేరి వెళ్లింది. వారంలో మంగళవారం మినహా మిగిలిన ఆరు రోజులు ఈ నౌకా సేవలు అందుబాటులో ఉంటాయని, రానుపోను రూ.8,500గా నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా, తొలిరోజున నౌకను మతసామరస్యం చాటేలా హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన వారు సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించడం విశేషం.

బిల్లుల్ని పెండింగ్‌లో ఉంచే అధికారం ఉంది

● సుప్రీంకోర్టులో గవర్నర్ కౌంటర్ దాఖలు



చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించే బిల్లుల్ని పెండింగ్‌లో ఉంచే అధికారం తనకు ఉందని సుప్రీంకోర్టులో గవర్నర్ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. శాసనసభలో ఆమోదించిన 12 బిల్లులకు గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ఈ నెలారంభంలో నాలుగు రోజులపాటు వాదోపవాదాలు కొనసాగాయి. ఈ సందర్భంగా గవర్నర్ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓ బిల్లును నిరుపయోగమని భావించినప్పుడు అదే బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి ఎలా పంపుతారంటూ గవర్నర్‌ను ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో గవర్నర్ తరఫున శుక్రవారం కౌంటర్ అఫిడవిట్ దాఖలైంది. ఆ అఫిడవిట్‌లో బిల్లులను పెండింగ్‌లో ఉంచే అధికారం గవర్నర్‌కు ఉందని వివరించారు. ప్రభుత్వం ప్రతిపాదించే బిల్లులను అంగీకరించడం, తిరస్కరించడం, పెండింగ్‌లో ఉంచడం, రాష్ట్రపతి ఆమోదానికి పంపే విచక్షణాధికారాలు గవర్నర్‌కు ఉన్నాయని పేర్కొన్నారు.

పెళ్లి పేరుతో మోసం... ఆపై ఏడుసార్లు అబార్షన్?

సీమాన్‌పై ఫిర్యాదును సీరియస్‌గా తీసుకోండి ● పోలీసు శాఖకు హైకోర్టు ఆదేశం



విజయలక్ష్మి, సీమాన్

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు, నామ్ తమిళర్ కట్చి అధినేత సీమాన్ పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించడం వల్లే నటి విజయలక్ష్మి ఏడుసార్లు అబార్షన్ చేసుకుందని, ఆయనకు వ్యతిరేకంగా దాఖలైన ఫిర్యాదును తీవ్రమైన విషయంగానే పరిగణించాలని మద్రాస్ హైకోర్టు పోలీసు శాఖను ఆదేశించింది. పెళ్లి పేరుతో తనను మోసగించాడంటూ సీమాన్‌పై 2011లో విజయలక్ష్మి వలసరవాక్కం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై నమోదు చేసిన కేసును రద్దు చేయాలని సీమాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జీకే ఇలంతిరయన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈనెల 17న తోసిపుచ్చిన విషయం తెలిసిందే. అంతేగాక పోలీసులు 12 వారాల్లో కేసుకు సంబంధించిన తుది నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ఈ పిటిషన్ తోసివేతకు సంబంధించిన సమగ్రమైన తీర్పును తాజాగా వెలువరించింది. సీమాన్ గతంలో దర్శకత్వం వహించిన సినిమాలో విజయలక్ష్మి నటించిందని, ఆ సమయంలో తన కుటుంబ సమస్యల కారణంగా సాయం కోసం వెళ్లినప్పుడు పెళ్లి చేసుకుంటానని ఆమెకు మాయమాటలు చెప్పి లైంగిక సంబంధం సాగించినట్లు పోలీసులు నమోదు చేసిన కేసులో వివరించారని ధర్మాసనం గుర్తు చేసింది. ఆ తర్వాత సీమాన్ వల్ల ఆమె ఏడుసార్లు అబార్షన్ చేసుకుందని, ఈ వివరాలను బట్టి ఈ ఫిర్యాదును ఆషామాషీగా తీసుకోకూడదని కటువుగా వ్యాఖ్యానించింది. సీమాన్‌కు వ్యతిరేకంగా నమోదైన కేసును వెనక్కు తీసుకునేందుకు అంగీకరిస్తూ న్యాయవాదికి సమర్పించిన లేఖ, సంబంధిత పోలీసు ఉన్నతాధికారికి చేరలేదని, కనుకనే ఈ ఫిర్యాదు రద్దు కాకుండా పోలీసులు పెండింగ్‌లో ఉంచారని పేర్కొంది. పోలీసులు 15 మంది సాక్షుల వద్ద కూడా విచారణ జరిపారని, ఇరువురి మధ్య ప్రేమలేదని, సాయం కోసం వెళ్లినప్పుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో సంబంధాలు పెట్టుకున్నారని, అంతే కాకుండా సీమాన్‌కు ఆమె ధనసాయం కూడా చేసిందని పేర్కొంది. ఈ అంశాలన్నింటినీ పరిశీలించినట్లయితే బాధితురాలు లేదా ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తి ఫిర్యాదును లేదా కేసును వెనక్కు తీసుకున్న ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చినట్లు భావించడానికి వీలులేదని కూడా స్పష్టం చేసింది. ఇరువురి మధ్య 2023 వరకు సంబంధాలు కొనసాగుతూనే ఉన్నట్లు పోలీసుల విచారణను బట్టి తెలుస్తోందని, ఆ అంశాలను పరిగణనలోకి తీసుకునే సీమాన్‌పై దాఖలైన లైంగిక వేధింపుల కేసును రద్దు చేయడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది.

సమాచార దర్శిని

నేడు 'సాహిత్యవనంలో లలిత సంగీత సౌరభం'

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక 158వ ప్రసంగం ఈనెల 23న ఆదివారం జరగనుంది. స్థానిక టి.నగర్ విజయ రాఘవ రోడ్డులోని ఆంధ్రా క్లబ్‌లో సాయంత్రం 6.30 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన కవయిత్రి, విశ్రాంతాచార్యులు స్వాతి శ్రీపాద 'సాహిత్యవనంలో లలిత సంగీత సౌరభం' అనే అంశంపై ఉపన్యసించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు రాజధాని కళాశాల ఆధ్వర్యంలో 'కావ్యం రసానుభవం'పై కాసల ఉపన్యాసం

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో 'కావ్యం రసానుభవం' అనే అంశంపై సోమవారం ఉపన్యాస కార్యక్రమం జరగనుంది. తెలుగుశాఖ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి తెలుగుశాఖ ఆచార్యుడు డాక్టర్ ఎం.మురళి స్వాగతం పలకనుండగా, అధ్యక్షురాలు డాక్టర్ ఎన్.ఎలిజబెత్ జయకుమారి అధ్యక్షత వహించనున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ప్రముఖ రచయిత, కవి డాక్టర్ కాసల నాగభూషణం... పింగళి లక్ష్మీకాంతం సుప్రసిద్ధ విమర్శన గ్రంథం 'సాహిత్య శిల్ప సమీక్ష'లోని రసప్రకరణం ఆధారంగా ఉపన్యసించనున్నారు.

పగటి పూట విద్యుత్ కోతలుండవు

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రాబోయే రెండు నెలల పాటు పగటి పూట విద్యుత్ కోతలు ఉండవని విద్యుత్ బోర్డు తెలిపింది. సీబీఎస్‌ఈ, రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో టెన్త్, ప్లస్‌వన్, ప్లస్‌టూ పరీక్షలు ప్రారంభం కాగా, మిగిలిన తరగతులకు వార్షిక, కళాశాల విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలు ఏప్రిల్ వరకు కొనసాగనున్నాయి. ఈ క్రమంలో, విద్యార్థుల సంక్షేమార్థం ఏప్రిల్ వరకు పగటి పూట విద్యుత్ కోతలు ఉండదని, అత్యవసర పరిస్థితుల్లో ప్రధాన ఇంజనీర్ అనుమతితో మరమ్మతులు చేపట్టాలని విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది.

ఖాళీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో అసిస్టెంట్ సర్జన్ సహా పలు ఖాళీ పోస్టుల కౌన్సెలింగ్ శనివారం ప్రారంభమై ఈనెల 24వ తేది వరకు జరగనుంది. కౌన్సెలింగ్‌లో ఎంపికైన వారు 15 రోజుల్లో తమకు కేటాయించిన ఆస్పత్రుల్లో విధుల్లో చేరాల్సి ఉంది. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 26వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ నియామకపత్రాలు అందిస్తారని వైద్య ఉద్యోగుల ఎంపిక బోర్డు (ఎమ్మార్బీ) పేర్కొంది.

టాన్సెట్, సీటా దరఖాస్తుల గడువు పొడిగింపు

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ తదితర కోర్సుల్లో అడ్మిషన్లకు 'టాన్సెట్, ఎంఈ, ఎంటెక్, ఎంప్లాన్, ఎమ్మార్క్ తదితర పీజీ కోర్సుల్లో చేరేందుకు సీటాలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి టాన్సెట్ మార్చి 22, సీటా మార్చి 23వ తేది జరగనున్నాయి. దరఖాస్తుల స్వీకరణ గత నెల 24వ తేది ప్రారంభమై ఈనెల 21వ తేదీతో ముగిసింది. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు సమర్పణ గడువు ఈ నెల 26వ తేది వరకు పొడిగించారు. /tancet.annauniv.edu/tancetలో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్లు మార్చి 8వ తేది, పరీక్షా ఫలితాలు ఏప్రిల్‌లో విడుదల చేసి, మేలో అడ్మిషన్లు చేపడతామని అన్నా విశ్వవిద్యాలయం పేర్కొంది.

1నుంచి తపాలా బీమా పాలసీ రెన్యువల్ శిబిరాలు

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాలపరిమితి చెందిన తపాలా జీవిత బీమా (పీఎల్‌ఐ), గ్రామీణ తపాలా బీమా (ఆర్‌పీఎల్‌ఐ) పాలసీల రెన్యువల్‌కు మార్చి 1 నుంచి మే 31వ తేది వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక శిబిరాలు ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని చేస్తాయి. కాలపరిమితి చెందిన బీమా పాలసీ రెన్యువల్‌కు రాయితీ కూడా అందించనున్నారు. ఆ ప్రకారం, రూ.లక్ష వరకు చెల్లించాల్సి ఉంటే 25 శాతం, రూ.3 లక్షలకు పైగా ఉంటే 35 శాతం రాయితీ అందజేయనున్నారు.

దూరవిద్య కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మద్రాసు విశ్వవిద్యాలయ దూరవిద్య విభాగం అందిస్తున్న యూజీ, పీజీ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వర్శిటీ రిజిస్ట్రార్ ఎస్.ఏలుమలై పేర్కొన్నారు. వర్శిటీ ప్రాంగణంలోని దూరవిద్య విద్యార్థుల అడ్మిషన్ కార్యాలయాన్ని శని, ఆదివారాలు సహా అన్ని రోజులు (ప్రభుత్వ సెలవు రోజులు మినహా) నేరుగా సంప్రదించి దరఖాస్తులు పొందవచ్చు. దరఖాస్తులను వర్శిటీ వెబ్‌సైట్‌లో పంపించవచ్చని రిజిస్ట్రార్ తెలిపారు.

కోలాహలంగా వీఐటీ వర్శిటీలో 'రివేరా-2025 కల్చరల్ ఫెస్ట్'



శ్రేయా ఘోషాల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు - వేడుకల్లో కేరింతలు కొడుతున్న విద్యార్థులు

వేలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఐటీ యూనివర్శిటీలో 23వ వార్షిక 'రివేరా-2025 కల్చరల్ ఫెస్ట్' కోలాహలంగా సాగుతోంది. ఈనెల 20న ప్రారంభమైన ఈ కల్చరల్ ఫెస్టివల్ ఆదివారంతో ముగియనుంది. కార్యక్రమంలో భాగంగా పలు రాష్ట్రాలు, దేశాలకు సంబంధించిన సంప్రదాయ కళారూపాలు ప్రదర్శించారు. శుక్రవారం రాత్రి ప్రముఖ నేపథ్య గాయకులు శ్రేయా ఘోషాల్ పాట కచేరి జరిగింది. ఈ వేడుకల్లో దేశంలోని 80 వర్శిటీలు, మలేసియా, నేపాల్, పోర్చుగల్, థాయ్‌లాండ్, రుమేనియా సహా 25 దేశాలకు చెందిన సుమారు 45,000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి 8 గంటలకు జరుగనున్న ముగింపు వేడుకల్లో బాలీవుడ్ నటుడు సోనూసూద్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. వేడుకల్లో వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్, వర్శిటీ ఉపాధ్యక్షులు శంకర్, శేఖర్, మేనేజింగ్ డైరెక్టర్ సంధ్య, వైస్ ఛాన్సలర్ పార్థసారథి మాలిక్, రివేరా ఆర్గనైజర్ గోకుల్‌కుమార్, ఫెస్టివల్ డైరెక్టర్ రూబన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూర్‌మార్కెట్ కాంప్లెక్స్ - నెల్లూరు మెమూ రైళ్ల రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మూర్ మార్కెట్ కాంప్లెక్స్ - సూళ్లూరుపేట - నెల్లూరు మెమూ రైళ్లను ఈ నెల 24, 27, మార్చి 1వ తేదీల్లో రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే పేర్కొంది. చెన్నై సెంట్రల్ - గూడూరు సెక్షన్‌లోని పెదపరియ - నాయుడుపేట మధ్య రైలు మార్గంలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా కొన్ని మెమూ రైళ్లు రద్దు చేశారు. ఆ ప్రకారం, మూర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లరుపేటకు ఉదయం 5.40, సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 8.10 గంటలకు వెళ్లే మెమూ రైళ్లు రద్దు. అలాగే, నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.20, సూళ్లూర్‌పేట నుంచి మూర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 12.35 గంటలకు వెళ్లే మెమూ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

నేడు భారత్-పాక్ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం దుబాయ్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య 50 ఓవర్ల క్రికెట్ మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్‌ను రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ ఎల్‌ఈడీ స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. మెరీనా బీచ్ (వివేకానంద హౌస్ ఎదురు), బీసెంట్ నగర్ బీచ్ (పోలీస్ బూత్ సమీపం)లో ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ప్రసారం చేయనుందని, ప్రజలు ఈ మ్యాచ్ వీక్షించేందుకు తరలి రావాలని అధికారులు ప్రకటన విడుదల చేశారు.


తగ్గిన చేపల ధరలు



తూత్తుకుడి చేపల మార్కెట్లో వ్యాపారులు, ప్రజలు

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడిలో దిగుబడి అధికం కావడంతో చేపల ధరలు శనివారం తగ్గాయి. తూత్తుకుడి తిరేష్‌పురం నాటుపడవల హార్బర్ నుంచి వెళ్లిన జాలర్ల వలలో భారీగా చేపలు చిక్కాయి. శనివారం ఉదయం జాలర్లు తీరానికి తిరిగి రాగా, వ్యాపారులు, ప్రజలు కొనుగోలు చేశారు. దీంతో, గతవారం కిలో రూ.1,200 విక్రయమైన సీలా చేపలు ప్రస్తుతం రూ.800, పారై, విళై, ఊలి తదితర చేపలు కిలో రూ.500, రొయ్యలు రూ.450, పీతలు రూ.350కు విక్రయమయ్యాయి. ధరలు తగ్గడంతో వ్యాపారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేయగా, జాలర్లు మాత్రం నిరుత్సాహపడ్డారు.

రూ.24 లక్షలతో పాఠశాలలో టాయిలెట్లు



ప్రారంభోత్సవంలో ఎంపీ ఎన్నార్ ఇళంగో, ఎమ్మెల్యే చంద్రన్ తదితరులు

తిరుత్తణి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి నియోజకవర్గం శ్రీ కాళికాపురంలోని పాఠశాలలో నూతనంగా నిర్మించిన టాయిలెట్లను ఎంపీ ఎన్నార్ ఇళంగో, ఎమ్మెల్యే చంద్రన్ ప్రారంభించారు. ఈ పాఠశాలలో కాళికాపురం సహా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 480 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కానీ, వారికి తగినన్ని టాయిలెట్లు లేవు. ఈ విషయమై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు రూ.24 లక్షల వ్యయంతో విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వురుగా టాయిలెట్లు నిర్మించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ అధ్యక్షత వహించగా, ఆర్కే పేట యూనియన్ కార్యదర్శులు షణ్ముగం, పళని, మాజీ చీఫ్ జనరల్ కమిటీ సభ్యుడు వీరమంగళం, రఘు ఆర్కే పేట మాజీ యూనియన్ వైస్ చైర్మెన్ తిలగవతి రమేష్ తదితరులు పాల్గొనగా, ఉపాధ్యాయులు ఎస్ఎస్ విజయన్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

జయ పేరవై ఆధ్వర్యంలో ప్రారంభమైన తిన్నైలపై ప్రచారం



స్థానిక వ్యాసర్పాడి మార్కెట్లో ప్రచారంలో పాల్గొన్న ఆర్ఎస్ రాజేష్, శరవణన్ తదితరులు

ప్యారీస్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి వచ్చే ఏడాది జరుగనున్న ఎన్నికలను పురస్కరించుకొని అన్నాడీఎంకే నిర్వహణలోని జయలలిత పేరవై ఆధ్వర్యంలో తిన్నైలపై ప్రచారం శనివారం ఉత్తర చెన్నై జిల్లాలో ప్రారంభమైంది. వ్యాసర్పాడిలోని మార్కెట్లో గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో అమలుపరచిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలతో ముద్రించిన కరపత్రాలను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ రాజేష్, పేరవై జిల్లా కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ డి.శరవణన్ పంపిణీ చేశారు.

రూ.1,100 కోట్ల జీఎస్టీ చెల్లించాలంటూ నోటీసులు

● వ్యతిరేకిస్తూ విద్యుత్ బోర్డు పిటిషన్

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగించినందుకు 2017 నుంచి 2021 వరకు రూ.1,100 కోట్లు జీఎస్టీ చెల్లించాలంటూ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్‌కు పంపిన నోటీసుపై విచారణకు మద్రాసు హైకోర్టు స్టే విధించింది. తమిళనాడు విద్యుత్ బోర్డు అనుబంధ సంస్థ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జీఎస్టీ (సరుకు మరియు సేవా పన్ను రూపంలో) 2017 -21 వరకు నాలుగేళ్లలో రూ.1,100 కోట్లు చెల్లించాలని జీఎస్టీ శాఖ నోటీసు పంపింది. దీనిని వ్యతిరేకిస్తూ తమిళనాడు ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. ఈ కేసు న్యాయమూర్తి కృష్ణన్‌రామస్వామి విచారించారు. ఆ సమయంలో ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది పి.విల్సన్... జీఎస్టీ విధానం అమలుకు ముందు విద్యుత్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్‌కు సర్వీస్ టాక్స్ నుంచి మినహాయింపు ఇచ్చారని, ఆ ప్రకారం, జీఎస్టీ విధింపునకు సంబంధించి నోటీసు పంపడం చట్టవ్యతిరేక చర్య అని వాదించారు. కార్పొరేషన్ వాదన పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి, జీఎస్టీ వసూలుకు సంబంధించిన చర్యలను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసి, తదుపరి విచారణ ఏప్రిల్ 7వ తేదీకి వాయిదావేశారు.

చేనేత కార్మికుల నిరాహారదీక్ష

● టీవీకే మద్దతు



నిరాహారదీక్షలో కార్మికులు

తిరుత్తణి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల సాధనకు తిరువళ్లూర్, రాణిపేట, వేలూరు జిల్లాలకు చెందిన సుమారు 1,000 మందికి పైగా కార్మికులు నిరాహార దీక్ష చేపడుతున్నారు. తిరుత్తణి నియోజకవర్గం పొదటూరుపేటలోని దీక్షా శిబిరాన్ని తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతలు పాల్గొని తమ మద్దతు తెలిపారు. చేనేత కార్మికుల సమస్యలను పార్టీ అధ్యక్షుడు విజయ్ దృష్టికి తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చారు. నిరసనలో పాల్గొన్న కార్మికులకు టీవీకే నేతలు ఆర్థిక సాయం అందించారు.

● ముగిసిన ప్రభుత్వ కార్యక్రమం
అరటి గెలలు, చెరకు గడలు ఎత్తుకెళ్లిన ప్రజలు



అరటి గెలలు తీసుకెళ్తున్న ప్రజలు

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తోరణాలుగా కట్టిన అరటి గెలలు, చెరకు గడలు తీసుకెళ్లేందుకు ప్రజలు పోటీపడ్డారు. కడలూరు మంజకుప్పం మైదానంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి, పలు శాఖల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు అందజేశారు. సీఎం రాక సందర్భంగా మైదానం అంతా సుందరంగా అలంకరించారు. ప్రవేశ ద్వారంలో అరటి గెలలు, చెరకు గడలు, పలురకాల పండ్లతో అలంకరించారు. కార్యక్రమం ముగిసిన వెంటనే ప్రజలు ప్రవేశ ద్వారం వద్దకు చేరుకొని పోటీపడి చేతికందనంత అరటి, చెరకు తీసుకెళ్లారు.

కోవైలో నిర్బంధ హిందీని నిరసిస్తూ ముగ్గులు

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య నగరం కోయంబత్తూరులో దొడ్డిదారిన హిందీ భాషను నిర్బంధంగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను నిరసిస్తూ డీఎంకే నగర శాఖ ఆధ్వర్యంలో ఇళ్ల ముందు నిరసన ముగ్గులు వేశారు. ఈ మేరకు పాప్పనాయకన్ పాళయంచ పొన్నినగర్ తదితర ప్రాంతాల్లోని ఇళ్ల ముందు మహిళలు వేకువజామునే హిందీ భాషకు వ్యతిరేకంగా నినాదాలతో ముగ్గులు వేశారు. ఈ నిరసన కార్యక్రమాల్లో డీఎంకే స్థానిక నాయకులు నాగరాజ్ బాబు, జబమాలదాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కోయంబత్తూరు పొన్నినగర్‌లో ఓ ఇంటి ముందు నిర్బంధ హిందీకి నిరసనగా వేసిన ముగ్గును పరిశీలిస్తున్న డీఎంకే నేతలు

పంచరత్న కృతులతో త్యాగరాజస్వామికి నీరాజనం

● ఐఎఫ్ఏఎస్‌లో ఘనంగా ఆరాధనోత్సవం



పంచరత్న కీర్తనలు ఆలపిస్తున్న సంగీత విద్వాంసులు, కళాకారులు

ప్యారీస్. ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ లలిత కళలను ప్రోత్సహిస్తున్న నగరంలోని ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ సొసైటీ (ఐఎఫ్ఏఎస్) పురాతన, మార్గనిర్దేశక సభలలో సంగీక కార్యక్రమాలను జనరంజకంగా నిర్వహిస్తూ వస్తోంది. కర్ణాటక శాస్త్రీయ సంగీతంలోని ముమ్మూర్తులలో ప్రథములైన త్యాగరాజస్వామి ఆరాధన దినోత్సవాన్ని శనివారం స్థానిక ఆళ్వార్‌పేట ఎతిరాజ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించింది. సుమారు 70 మంది సంగీత విద్వాంసులు, 100 మందికి పైగా కళాకారులు ఒకే వేదికపై ఆసీనులై త్యాగయ్య రచించిన కీర్తనల్లో ప్రజాదరణ పొందిన ఐదు కృతులను శ్రావ్యంగా ఆలపించి అంజలి ఘటించారు. సంగీత విద్వాంసులు శ్రీముష్ణం వి.రాజారావు, నర్మద, భూషణి కల్యాణరామన్, లయర్ సిస్టర్స్, మధువంతి బద్రీ, గీతారాజ, మిస్టర్ కలకత్తా శంకర్, శ్రీరంజని కౌశిక్, పీఏస్ అమదు, మిస్టర్ తిరుచ్చి మురళి, ఎస్.రాధాకృష్ణన్, కరూర్ కృష్ణమూర్తి సహా గాత్ర విద్వాంసులు, వయొలిన్, మృదంగిస్టులు, ఘటం, మోర్సింగ్, కంజిర విద్వాన్‌లతో కలసి ఐఎఫ్ఏఎస్ గౌరవ కార్యదర్శి ఆర్.రాధాకృష్ణన్ త్యాగయ్యకు నివాళులర్పించారు. చివరగా అబిరామ బోడె (నట్టువాంగం), విశ్వేష్ చంద్రశేఖర్ (వయొలిన్), కిషోర్ రమేష్ అందించిన సంగీత కార్యక్రమం శ్రోతలను అలరించింది.

నిర్బంధ హిందీ మాకొద్దు

● డీఎంకే కరపత్రాల ప్రచారం



వ్యాపారులకు కరపత్రాలు అందజేస్తున్న నేతలు

తిరుత్తణి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నిర్బంధ హిందీ మాకొద్దని, ద్విభాషా విధానమే తమ ప్రభుత్వ లక్ష్యమని డీఎంకే నేతల ప్రచారం చేపట్టారు. అమ్మయార్‌కుప్పం సహా పలు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అమలుచేయతలపెట్టిన కొత్త విద్యా విధానం వల్ల మాతృభాషకు కలిగే అన్యాయాన్ని ప్రజలకు వివరించేలా వ్యాపారులు, ప్రజలకు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ నేతృత్వం వహించగా, పార్టీ మండల కార్యదర్శులు షణ్ముగం, పళని, సెంగుట్టవన్ సహా పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులు మరుగుపరిచేందుకే భాషా వివాదం

● టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్



సమావేశంలో జీకే వాసన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ప్యారీస్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను మరుగుపరిచేందుకే డీఎంకే ప్రభుత్వం భాషా సమస్య గురించి మాట్లాడుతోందని తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్ ఆరోపించారు. స్థానిక ఎగ్మూర్‌లోని అశోక హోటల్‌లో టీఎంసీ చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల నిర్వాహకుల సమావేశం శనివారం జరిగింది. ఇందులో ప్రధాన కార్యదర్శులు జీఆర్ వెంకటేష్, శక్తివడివేల్, తిరువేంగడం, వీబీ జవహర్‌బాబు, జిల్లా అధ్యక్షులు ఈకే అరుణ్‌కుమార్, బిజూ చాకో సహా 500 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ, బూత్ కమిటీల నియామకం, ఓటరు జాబితా సవరణ పనుల్లో పాల్గొనడం తదితర అంశాలపై చర్చించారు.

రూ.95 లక్షల విలువైన మత్తు బిళ్లల స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్



పట్టుబడిన నిందితులు

ప్యారీస్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి సముద్రతీరం నుంచి పడవలో శ్రీలంకకు అక్రమంగా తరలించేందుకు యత్నించిన రూ.95 లక్షల విలువైన మత్తు బిళ్లలు, విదేశీ సిగిరెట్లను స్వాధీనం చేసుకున్న క్యూ బ్రాంచ్ పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. తూత్తుకుడి జిల్లాలోని సముద్రతీరాల నుంచి పడవల ద్వారా శ్రీలంకకు బీడి ఆకులు, పసుపు, విదేశీ సిగిరెట్లు, గంజాయి, మత్తు ఇంజెక్షన్లు, మత్తు బిళ్లలు తదితరాలను అక్రమంగా తరలించడాన్ని అడ్డుకొనేందుకు భారత నావికాదళం, క్యూ బ్రాంచ్ పోలీసులు సంయుక్తంగా నిఘా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం రాత్రి తూత్తుకుడి సముద్రతీరం నుంచి శ్రీలంకకు విలువైన వస్తువులు పడవ ద్వారా తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు క్యూ బ్రాంచ్ పోలీసులకు సమాచారం తెలిసింది. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసు బృందం త్రేస్‌పురంనుంచి శ్రీలంకకు తరలించేందుకు ఓ పడవలో కొందరు సరుకులు ఎక్కిస్తుండగా చుట్టుముట్టారు. అనంతరం పడవలో 10 బస్తాల్లో 3.15 లక్షల మత్తు బిళ్లలు, విదేశీ సిగిరెట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణాకు పాల్పడిన జనింగ్‌స్టన్, హనీష్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు టీచర్ అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన టీచర్‌ను పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్ట్ చేశారు. తెన్‌కాశి జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి ఉపాధ్యాయుడు తమను లైంగికంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో, జిల్లా పిల్లలు, మహిళల భద్రతా శాఖ అధికారులు పాఠశాలకు నేరుగా వెళ్లి విచారించగా, సైన్స్ టీచర్ విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నట్లు తెలిసింది. అధికారుల ఫిర్యాదుతో శంకరన్‌కోయిల్ మహిళా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి, కన్నియాకుమారి ప్రాంతంలో తలదాచుకున్న ఉపాధ్యాయుడిని శుక్రవారం అరెస్ట్ చేశారు.

పబ్లిక్ పరీక్షలకు భయపడి విద్యార్థి ఆత్మహత్య

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలకు భయపడిన విద్యార్థి 14 అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మొగప్పెర్‌కు చెందిన నికోల్ ఆంటోని (19) గత ఏడాది ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలయ్యాడు. ఆ సమయంలో అతన్నిమందలించిన తల్లిదండ్రులు, ఈ సారి పరీక్షల్లో అధిక మార్కులు సాధించాలని ఒత్తిడి చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం ఆంటోని ప్లస్‌టూ పరీక్ష రాయాల్సి ఉండడంతో, తల్లిదండ్రులు తెల్లవారుజామున 3 గంటలకు అతన్ని నిద్రలేపారు. పరీక్ష భయంతో ఉన్న ఆంటోని ఇంటి నుంచి తన బైక్‌లో నొలంబూర్ సర్వీస్ రోడ్డులోని ఓ ఎత్తైన అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకున్నాడు. అపార్ట్‌మెంట్‌లోని 14వ అంతస్తుకు వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకాడు. తలకు తీవ్రగాయాలైన ఆంటోని సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న నొలంబూర్ పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మంత్రి పొన్ముడిపై బురద చల్లిన యువకుడి అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): వరద బాధిత ప్రాంతాలు పరిశీలించేందుకు వెళ్లిన మంత్రి పొన్ముడిపై బురద చల్లిన కేసులో యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.గత ఏడాది నవంబరు 30వతేది తుఫాను తీరం దాటే సమయంలో అతి భారీవర్షాలు కురిశిన విషయం విదితమే. ఈ క్రమంలో, ఇరువేల్‌పట్టువరదలకు తీవ్రనష్టం చవిచూడగా, డిసెంబరు 3వ తేది ఆ ప్రాంతాన్ని అటవీ శాఖ మంత్రి పొన్ముడి పరిశీలించారు. ఆ సమయంలో కొందరు మంత్రి, కలెక్టర్, ప్రభుత్వ అధికారులపై బురద చల్లి, వారితో వాగ్వాదానికి దిగారు. పార్టీ నేతల ఫిర్యాదుతో అదే గ్రామానికి చెందిన రామర్ అలియాస్ రామకృష్ణన్, విజయరాణి తదితరులపై తిరువెన్నయనల్లూర్ పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నారు. ఈ వ్యవహారంలో 80 రోజుల అనంతరం శుక్రవారం రామకృష్ణన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు జైలుకు తరలించి, మరో నిందితుడు, బీజేపీ నేత విజయరాణి కోసం గాలిస్తున్నారు.

టన్ను ఎర్రచందనం స్వాధీనం

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసర్పాడిలోని ఓ ఇంట్లో దాచి ఉంచిన 960 కిలోల ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వ్యాసర్పాడి సమీపంలోని ఓ ఇంట్లో ఎర్రచందనం దుంగలు దాచినట్టు సమాచారంతో శుక్రవారం రాత్రి ఆ ఇంట్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మహమ్మద్ రసూల్‌ను అరెస్ట్ చేశారు. ఆంధ్రా నుంచి దుంగలు తీసుకొచ్చినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో మరెవరికైనా సంబంధాలున్నాయా? ఈ దుంగలు ఎక్కడికి తరలించేందుకు దాచారు? సహా పలు కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు.

బాలికను వివాహం చేసుకున్న యువకుడి అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బాలికను వివాహం చేసుకున్న యువకుడిని పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్ట్ చేశారు. మైలాడుగురైకి చెందిన మారిముత్తు బాలికను ప్రేమిస్తున్నానని మాయ మాటలు చెప్పి వివాహం చేసుకున్నాడు. ఈ వ్యవహారంపై కొందరు నెం.1098లో జిల్లా చిన్నారుల సంరక్షణ కేంద్రానికి సమాచారం అందించారు. అధికారులు, మహిళా పోలీసులతో ఆ ప్రాంతానికి వెళ్లి విచారణ చేపట్టి, బాలికను ప్రభుత్వ హోంకు తరలించి, మారిముత్తును అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

నేత్రపర్వంగా రుక్మిణి ద్వారకదాష రథయాత్ర



రథం లాగుతున్న భక్తులు - అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రుక్మిణి ద్వారకదాష రథయాత్ర నేత్రపర్వంగా సాగింది. స్థానిక బిసెంట్ నగర్ బీచ్‌లో సాయంత్రం 5.30 గంటలకు మాజీ డీజీపీ మహేంద్రన్ ప్రారంభించిన ఈ రథయాత్రలో ఇస్కాన్ నిర్వాహకులు మధు పండిట్‌దాస్, దమల్ రామకృష్ణన్ స్వామి, హరే కృష్ణ సంస్థ చెన్నై అధ్యక్షుడు నరసింహదాస్ తదితరులు పాల్గొన్నారు. 'హరే రామ హరే కృష్ణ' అంటూ వందలాది మంది భక్తులతో ప్రారంభమైన ఈ యాత్ర మహాత్మాగాంధీ రోడ్డు, ఇందిరానగర్, తిరువాన్మియూర్ మీదుగా రాత్రి 8 గంటలకు తిరువాన్మియూర్ వాల్మీకినగర్‌లోని దక్షిణ ద్వారక ధామ్‌కు చేరుకుంది. రథయాత్రలో దేవతామూర్తుల వేషధారణలతో పాల్గొన్న కళాకారులు, ఒయిలాట్టం, నెమలి ఆట్టం, కోలాటంతో సందడి చేశారు. అలాగే, ఇస్కాన్ భక్తులు భజనలతో భక్తిని చాటుకున్నారు.

పళ్లిపట్టు తహసీల్దార్‌గా భారతి



తిరుత్తణి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ ప్రతాప్ ఉత్తర్వులతో పళ్లిపట్టు తహసీల్దార్‌గా డి.భారతి పదవీబాధ్యతలు చేపట్టారు. ఆమెకు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, గ్రామ పరిపాలన అధికారులు, కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భారతి మాట్లాడుతూ... అన్ని రకాల సర్టిఫికేట్లు, ప్రభుత్వ సంక్షేమ సహాయాలు ఆలస్యం లేకుండా అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

మెరీనా శుభ్రత... అందరి బాధ్యత

● నగరవాసులకు గ్రేటర్ చెన్నై పిలుపు

SUNDAY SPECIAL



జెండా ఊపి శుభ్రతా పనులు ప్రారంభిస్తున్న మేయర్ ప్రియ - శుభ్రతా పనుల్లో విద్యార్థులు

ప్యారీస్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతి పొడవైన, సుందరమైన రెండో బీచ్‌గా పేరుగాంచిన మెరీనా బీచ్‌ను యుద్ధప్రాతిపదికన శుభ్రపరిచేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) నడుం బిగించింది. ఆ మేరకు 'మన చెన్నై- మన బాధ్యత', 'మన మెరీనా - మనకే గర్వకారణం' అన్న నినాదాలతో శనివారం 5,000 మందితో మెరీనాలో పరిశుభ్రత పనులు ప్రారంభమయ్యాయి. జీసీసీతో రాష్ట్ర సంక్షేమ పనుల పథకం ప్రతినిధులు, యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ అధికారులు, నగరంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ వలంటీర్లు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, ప్రజలు, జీసీసీ పారిశుధ్య కార్మికులు కలిపి సుమారు 5,000 మందికి పైగా పాల్గొన్న ఈ శుభ్రతా పనులను మేయర్ ప్రియ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నగరం, శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలతో సహా వివిధ ప్రాంతాల నుంచి శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో తమ కుటుంబాలతో నగరానికి వచ్చే వారు ప్రకృతి వరప్రసాదంగా ఇచ్చిన మెరీనా తీరంలో సేదతీరుతుంటారని, అందువల్ల మెరీనా తీరాన్ని పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని సూచించారు. జీసీసీ తరఫున ప్రతిరోజూ ఇక్కడ పరిశుభ్రత పనులు చేపడుతున్నప్పటికీ, ఇక్కడికొస్తున్న ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా హెచ్చరిస్తూ బోర్డులు ఏర్పాటు చేశామని, ఇందుకోసం ప్రత్యేక చెత్తకుండీలు అందుబాటులో ఉంచామన్నారు. ప్రపంచంలోనే అతి పొడవైన రెండో బీచ్‌గా పేరుగాంచిన మెరీనాకు 'బ్లూ ఫ్లాగ్' గుర్తింపు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టిందని, ఇది నెరవేరాలంటే ప్రతి ఒక్కరు మెరీనా తీరాన్ని శుభ్రంగా ఉంచేందుకు తమ వంతు సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీసీసీ కమిషనర్ కుమరగురుపరన్, సెంట్రల్ రీజినల్ జాయింట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.



శుభ్రతా పనుల్లో మేయర్ ప్రియ

పళని దండాయుధపాణి స్వామికి అత్తింటి సారె

● పండ్లు, ఫలహారాలు సమర్పించిన గిరిజనులు



ఊరేగింపునకు ముందు సారె వివరాలను చదువుతున్న 'వన వేంగైగళ్' పార్టీ ప్రతినిధి

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలో ఆరుపడైవీడులోని పళని దండాయుధపాణి స్వామివారి ఆలయంలో శనివారం ఉదయం 'కురవర్' తెగకు చెందిన గిరిజన భక్తులు వివిధ రకాల ఫలాలను, కొండతేనె, కూరగాయలు, ఫలహారాలను సమర్పించారు. స్వామివారి ద్వితీయ సతీమణి వళ్లీదేవి కురవర్ జాతికి చెందినవారై ఉండటంతో ఆ జాతికి చెందిన గిరిజనులు స్వామివారికి యేటా అత్తింటి సారె సమర్పించడం ఆనవాయితీ. ఆ మేరకు ఈ 'కురువర్' తెగ ప్రజలు జిల్లా అంతటా పండే వివిధ రకాల తియ్యటి పండ్లను సారెగా ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి సమర్పిస్తుంటారు. తైపూసం వేడుకలు ముగిసిన తర్వాత ఈ తియ్యటి ఫలాల సమర్పణ నిర్వహిస్తుంటారు. ఆ మేరకు శుక్రవారం ఉదయం రాష్ట్రం నలుమూలల నుంచి కురవర్ తెగకు చెందిన గిరిజనులు, 'వనవేంగైగళ్' కట్చి కార్యకర్తలు మామిడి, పనస, ద్రాక్ష, అరటి, అనాస, ఖర్జూరం, దానిమ్మ, బొప్పాయి, బత్తాయి, చిలగడ దుంపలు, మొక్కజొన్న కంకులు,జామపండ్లు, సపోటాలు,తేగలు, కొండ తేనె, తాటిబెల్లంను బుట్టలలో తలపై పెట్టుకుని పళని బస్టాండు నుంచి మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు.ఆ తర్వాత అందరూ స్వామివారిని దర్శించుకుని తిరుగుముఖం పట్టారు.మురుగప్పెరుమాన్ కురవర్ జాతికి చెందిన వళ్లీదేవిని పరిణయమాడటం వల్ల ఆ స్వామివారికి అత్తింటి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని స్థానిక శైవ పండితులు తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 'పారాలింపిక్స్'



విజేతలకు బహుమతుల ప్రదానం

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ ఎలైట్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగుల చిన్నారుల కోసం శనివారం తిరువేర్కాడు సుదర్శన్ విద్యాశ్రమంలో 'పారాలింపిక్స్-2025' పోటీలు జరిగాయి. 1500 మందికి పైగా బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొని తమ అసాధారణ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. వివిధ వయసుల వారు పరుగు పందెం, క్రికెట్ బాల్ విసరడం, లాంగ్ జంప్ వంటి పోటీల్లో పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై సెంట్రల్ ఎలైట్ నిర్వాహకుడు డాక్టర్ కరుణామయ నేతృత్వంలో చెన్నై సెంట్రల్ ఎలైట్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు సంతోష్‌కుమారి రాథోడ్, కార్యదర్శి రోహిత్, ప్రాజెక్ట్ చైర్ అజయ్ హేమకుమార్ తదితరులు ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమారి మాట్లాడుతూ.. ఇది కేవలం కార్యక్రమం కాదని, మానవస్ఫూర్తికి వేడుకలాంటిదన్నారు. వ్యక్తి సామర్థ్యాలకు అతీతంగా చూడటానికి, ప్రతి బిడ్డలోని అసాధారణ సామర్థ్యాన్ని గుర్తించడానికి ప్రేరణనిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉత్పత్తి సామర్థ్యం 3 వేల యూనిట్లకు పెంపు

● ఎలైట్ ఎలివేటర్స్ ఎండీ విమల్ బాబు



కొత్త లిఫ్టులను ఆవిష్కరిస్తున్న విమల్‌బాబు

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది చివరి నాటికి తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని 3వేల యూనిట్లకు పెంచడమే తమ లక్ష్యమని ఎలైట్ ఎలివేటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ విమల్‌బాబు పేర్కొన్నారు. శనివారం కోయంబత్తూరులో కొత్తగా 'ఎలైట్ ఎక్స్300', 'ఎక్స్300 ప్లస్' హోంలిఫ్టులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారతీయ గృహ ఎలివేటర్ మార్కెట్ 2030 నాటికి 8-9 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేయబడినందున ఈ విస్తరణను తాము సద్వినియోగం చేసుకుంటామని వివరించారు.

రోటరీ క్లబ్ జాబ్‌మేళాకు విశేష స్పందన

● 400 మంది వికలాంగులకు ఉద్యోగావకాశాలు



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 'రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ టి.నగర్', 'వి-షెష్', 'ది స్పెషల్ నీడ్స్ ఈక్వల్ ఆపర్చునిటీ సెల్ ఆఫ్ డీజీ వైష్ణవ్ కాలేజ్' సంయుక్త ఆధ్వర్యంలో వికలాంగుల కోసం శనివారం ప్రత్యేక జాబ్ మేళా జరిగింది. ఇందులో పాల్గొన్న 33 కార్పొరేట్ సంస్థలు 400 మందికి ఉద్యోగావకాలు కల్పించాయి. ఇంటర్వ్యూలు ముగియగానే నియామక పత్రాలను కూడా అందించారు. ఇందులో టీసీఎస్, జేపీ మోర్గాన్, ఎస్‌బీఐ లైఫ్, మహీంద్రా అండ్ మహీంద్రా వంటి ప్రఖ్యాత సంస్థలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.శేఖర్, గౌరవ అతిథులుగా హాజరైన డీజీ వైష్ణవ్ కళాశాల కార్యదర్శి అశోక్ జె.ముంద్రా, ఆర్టీఎస్ మహావీర్ బోత్రా జాబ్‌మేళా లోగోను లాంఛనంగా ఆవిష్కరించి, అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

తమిళ చిత్రజ్యోతి

కృతిక ఉదయనిధి దర్శకత్వంలో విజయ్ సేతుపతి!




విజయ్ సేతుపతి, కృతిక ఉదయనిధి

ప్రముఖ హీరో విజయ్ సేతుపతిని మహిళా దర్శకురాలు కృతిక ఉదయనిధి డైరెక్ట్ చేయనున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపుదిద్దుకోనుందని కోలీవుడ్ వర్గాలు పేర్కొన్నాయి. జయం రవి హీరోగా కృతిక ఉదయనిధి రూపొందించిన 'కాదలిక్క నేరమిల్లై' వంటి విభిన్నమైన మూవీ గత నెలలో సంక్రాంతి పండుగకు విడుదలైంది. ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులను నిరాశపరిచింది. ఇప్పుడు తన తదుపరి ప్రాజెక్టుపై ఆమె దృష్టిసారించారు. విజయ్ సేతుపతిని హీరోగా కృతిక ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు.ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు సాగుతున్నాయి. ఈ చిత్రాన్ని నిర్మించే నిర్మాణ సంస్థ, ఇందులో నటించే నటీనటులు తదితర వివరాలపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది.

సమష్టి కృషితోనే సినిమా విజయం

● పా.విజయ్

సినిమా విజయం సమష్టి కృషితోనే సాధ్యమని, అది కళాకారుడు(హీరో)కి చేరుతుందని సినీ గేయ రచయిత, దర్శకుడు పా.విజయ్ అన్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'అగత్య'. జీవా, రాశీఖన్నా జంటగా నటించారు. సీనియర్ హీరో అర్జున్, యోగిబాబు, వీటీవీ గణేష్ తదితరులు ముఖ్యపాత్రలను పోషించారు. ఈ నెల 28న విడుదలకానుంది. వామ్ ఇండియా సహకారంతో వేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ పతాకంపై నిర్మాత డాక్టర్ ఐసరి కె.గణేష్ భారీ బడ్జెట్‌తో నిర్మించారు. సంగీతం యువన్ శంకర్ రాజా. చిత్రం విడుదలను పురస్కరించుకుని శనివారం నగరంలో చిత్ర బృందం విలేకరుల సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో దర్శకుడు పా.రంజిత్ మాట్లాడుతూ, "అగత్య' హారర్ అడ్వెంచర్ మూవీ. భారీ బడ్జెట్‌తో తెరకెక్కింది. సాధారణంగా దెయ్యం జోనర్‌లో అనేక చిత్రాలు వచ్చాయి. హీరో జీవా కూడా ఈ తరహాలో అనేక చిత్రాల్లో నటించారు. కానీ, ఇది హారర్ చిత్రాలకు భిన్నంగా అడ్వెంచర్ తరహాలో స్క్రిప్టు సాగుతుంది. ఇది ఆయనకు ఎంతగానో నచ్చింది. అందుకే ఒప్పుకున్నారు. ఇలాంటి చిత్రాలకు భారీ బడ్జెట్ అవసరం. ఆ మేరకు బడ్జెట్ పెట్టే దమ్మున్న నిర్మాత ఐసరి కె.గణేష్. మంచి స్క్రిప్టుతో కొత్త దర్శకులు ఎవరైనా సరే ఆయన వద్దకు వెళితే ఆ ప్రాజెక్టు కార్యరూపందాల్చుతుంది. అందుకే నేనే ఉదాహరణ. రెండేళ్ల క్రితం ఈ ప్రాజెక్టును ప్రారంభించాం. సినిమాలో అత్యధిక భాగం సీజీ వర్క్ ఉంది. మొత్తం ఆరు పాటలున్నాయి. అన్ని అంశాలతో అందరికీ నచ్చేలా సినిమా తీశాం. ఆదరించండి' అన్నారు. నిర్మాత గణేష్ మాట్లాడుతూ... 'సినిమా బాగా వచ్చింది. భారీ బడ్జెట్ పెట్టిన సంతృప్తి మిగిలింది. ముమ్ముందు మా బ్యానరులో వరుస ప్రాజెక్టులు వస్తాయి. వీటిని త్వరలోనే వెల్లడిస్తాం. హీరో జీవాతో యేడాదికి ఒక చిత్రం నిర్మిస్తా. అది మా ఇద్దరి మధ్య ఉన్న స్నేహబంధం. ఈ చిత్రం ఈనెల 28వ తేదీన తమిళం, తెలుగు, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నాం' అన్నారు. హీరో జీవా మాట్లాడుతూ... 'ఈ స్క్రిప్టు చదివాక నిర్మాత గణేష్‌ను సంప్రదించాం. ఆయన స్టోరీ విన్న వెంటనే నిర్మించేందుకు అంగీకరించారు. నాన్న నిర్మాతగా రూపొందుతున్న 99వ చిత్రంలో నటిస్తున్నా. 100వ చిత్రాన్ని ఎవరితో తీస్తారన్న ఐడియా నాకు లేదు' అన్నారు. హీరోయిన్ రాశీఖన్నా మాట్లాడుతూ... 'నేను గతంలో దెయ్యం సినిమాల్లో నటించాను. ఆ చిత్రాలకు భిన్నంగా 'అగత్య' ఉంటుంది' అన్నారు.



విలేకరుల సమావేశంలో పా.విజయ్, గణేష్, జీవా, రాశీఖన్నా

వినోద పన్నును రద్దు చేయాలి

● కమల్ వినతి



కమలహాసన్, ఉదయనిధి తదితరులు

సినిమాలకు రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేసే వినోద పన్నును పూర్తిగా రద్దు చేస్తే చిత్రపరిశ్రమకు భారీ ఊరట లభిస్తుందని అగ్ర నటుడు కమలహాసన్ అన్నారు. నగరంలో ఫిక్కీ ఆధ్వర్యంలో జరిగిన ఒక సదస్సులో హీరో కమల్ పాల్గొని మాట్లాడుతూ, 'ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పన్ను వసూలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా పన్నును విధించడం వల్ల రెండు రకాల పన్నులను వసూలు చేసినట్టు అవుతుంది. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం వినోద పన్నును రద్దు చేయాలని కోలీవుడ్ తరఫున విజ్ఞప్తి చేస్తున్నా' అని కోరారు. ఇదే కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమల్ వినతిపై డిప్యూటీ సీఎం స్పందించారు. ఈ విషయాన్ని సీఎం స్టాలిన్ దృష్టికి తీసుకెళ్ళి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కమల్ చిత్రాలు చూస్తూ పెరిగా

● త్రిష



అగ్రహీరో కమలహాసన్ చిత్రాలను చూస్తూ తాను పెరిగానని హీరోయిన్ త్రిష అన్నారు.నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, 'నా బాల్యం నుంచి కమల్ చిత్రాలను చూస్తూ పెరిగా. సుమారు 300 వరకు చిత్రాల్లో ఆయన నటించారు.వీటిలో కొన్ని చిత్రాలను 30, 40 సార్లు చూశా. నాకు కష్టమొచ్చినా, సంతోషమొచ్చినా 'మైఖేల్ మదన్ కామరాజన్', 'నాయగన్', 'దేవర్ మగన్'ను చూస్తుంటా. శోకంలో ఉన్నప్పటికీ చూస్తా. 'విక్రమ్' నాకు బాగా నచ్చిన చిత్రం. ఈ సినిమాను థియేటర్‌లోనే మూడుసార్లు చూశా. ఆ తర్వాత ఇంట్లో మరో రెండు సార్లు వీక్షించాను. మనమంతా ఆయన సినిమాలు చూస్తూ పెరిగాం. ఇపుడు ఆయనతో కలిసి ఓ చిత్రంలో నటిస్తున్నా. ఇది నా అదృష్టంగా భావిస్తున్నా' అని పేర్కొన్నారు.

పెరియార్ డ్యాం తనిఖీకి కొత్త గస్తీ పడవ

కేరళ ప్రభుత్వ వైఖరిపై తమిళ రైతుల ఆందోళన



పెరియార్ డ్యామ్ వద్ద గస్తీ పడవను ప్రారంభిస్తున్న కేరళ మంత్రి అగస్టీన్

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పెరియార్ డ్యాంను తనిఖీ చేయడానికి కేరళ ప్రభుత్వం కొత్తగా గస్తీ పడవను ప్రారంభించడం పట్ల తమిళ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముల్లై పెరియార్ డ్యాం రాష్ట్ర నీటి వనరులశాఖ అధీనంలో ఉంది. ఆ డ్యాం నుంచి తేని, దిండుగల్, శివగంగ, రామనాథపురం, మదురై జిల్లాల్లో 2.47 లక్షల ఎకరాలకు సాగుజలాలు అందుతుంటాయి. అంతేకాకుండా కోటిమందికి తాగునీరును కూడా ఆ డ్యాం నుంచే అందుతోంది. డ్యాంను తరచూ పరిశీలించేందుకు తేక్కడి బోట్‌పాయింట్ నుంచి జలరత్న, కన్నగి అనే రెండు పడవలను ఇంజనీరింగ్ సిబ్బంది ఉపయోగిస్తుండేవారు. ఆ పడవలు పాతబడటంతో 11 యేళ్లకు ముందు రూ.కోటితో రెండు పడవలు కొనుగోలు చేశారు. వాటిలో 'తమిళ్ అన్నై' పేరుతో ఓ పడవను తేక్కడి బోట్ పాయింట్‌కు తరలించారు. అయితే ఆ పడవ వేగం (హార్స్‌పవర్) పరిమితికి మించి ఉందంటూ నడిపేందుకు కేరళ ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ప్రస్తుతం తేక్కడి నుంచి పెరియార్ పులుల అభయారణ్య ప్రాంతానికి తొమ్మిది పడవలు నడుపుతున్నారు. ఈ పరిస్థితులలో పెరియార్ డ్యాంపై నిఘా వేయడానికిగాను కేరళ నీటి వనరుల శాఖ కొత్తగా కొనుగోలు చేసిన గస్తీ పడవను ఆ రాష్ట్ర మంత్రి రోసీ అగస్టీన్ ప్రారంభించారు. ఈ విషయం తెలియగానే ఆ డ్యాం ఆయకట్టు రైతులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర నీటి వనరుల శాఖకు చెందిన పడవను నడిపేందుకు అనుమతించని కేరళ ప్రభుత్వం ప్రస్తుతం 130 నుంచి 150 హార్స్‌పవర్ సామర్థ్యం కలిగిన ఇంజన్లు ఉన్న పడవలను నడపటం గర్హనీయమంటున్నారు. కేరళ ప్రభుత్వం అనుమతించకపోవడం వల్ల 11 యేళ్ల తేక్కడి వద్దే ఉన్న పడవ సామర్థ్యం కంటే కేరళ ప్రభుత్వ పడవ వేగ సామర్థ్యం అధికమని పేర్కొన్నారు. ఈ కొత్త పడవను తమిళనాడు ప్రభుత్వ అనుమతి లేకుండా నడపడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. పెరియార్ డ్యాం ప్రస్తుతం కేరళ ప్రభుత్వ పడవల సంచారమే అధికంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కేరళ ప్రభుత్వం నడుపుతున్న పడవల సంఖ్యను తగ్గించాలని జాతీయ పులుల అభయారణ్య సంస్థకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు. అంతేకాకుండా కంబం నుంచి కుములి వరకు నిరసన ప్రదర్శన జరుపనున్నట్లు వైగై ఆయకట్టు రైతు సంఘాల సమాఖ్య సమన్వయకర్త అన్వర్ బాలసింగం హెచ్చరించారు.



పదేళ్లకు పైగా తేక్కడి వద్దే సంచరిస్తున్న 'తమిళ్ అన్నై' పడవ

ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్యారీస్,ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోపాలపురంలోని గీతా భవన్ ట్రస్ట్, ఆరోగ్య భారతి - తమిళనాడు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా ఆర్థోపెడిక్ వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 300 మంది పాల్గొన్న ఈ శిబిరానికి గీతా భవన్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మనుగోయల్ అధ్యక్షత వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు, ఆర్థో స్పెషలిస్టులు ఇళవరసన్, హరిహరన్ పాల్గొని ఆర్థరైటిస్, వెన్నెముక సంబంధిత సమస్యలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు అందించారు. ఆపరేషన్ అవసరమైన వారికి ట్రస్ట్ తరఫున ఉచిత శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు మనుగోయల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు మనోహర్‌లాల్, గుప్తా, గోయంకా తదితరులు పాల్గొన్నారు.

తారామంగళంలో శివలింగాన్ని స్పృశించని సూర్యకిరణాలు

● నిరాశ చెందిన భక్తులు



ఆలయ రాజగోపురం నుంచి ప్రవేశిస్తున్న సూర్యకిరణాలు - గర్భాలయం ముందు నిలిచి ఆసక్తిగా చూస్తున్న భక్తులు

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా తారామంగళం కైలాసనాథర్ ఆలయంలో మూలవిరాట్టుపై సూర్యుడి కిరణాలు ప్రసరించకపోవడంతో భక్తులు నిరాశకు గురయ్యారు. ఆ ఆలయంలో యేటా ఫిబ్రవరి 21వ తేదీ నుంచి 23 వరకు సంధ్యాసమయంలో గర్భాలయంలోని శివలింగంపై సూర్యుడి కిరణాలు ప్రసరించడం ఆనవాయితీ. మొదటి రోజు శివలింగం శిరస్సుపై, రెండో రోజు శివలింగం నడుమ, మూడో రోజు శివలింగం అడుగుభాగాన సూర్యుడి కిరణాలు ప్రసరిస్తాయి. ఈ అద్భుత దృశ్యాల్ని వీక్షించడానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఆలయంలో మూలవిరాట్టుపై సూర్యుడి కిరణాలు ప్రసరించే దృశ్యాన్ని చూడటానికి ఉదయం నుంచే వేల సంఖ్యలో భక్తులు గుమికూడారు. భక్తులందరూ ఎదురుచూస్తుండగా సాయంత్రం 6గంటలకు రాజగోపురం మీదుగా సూర్యుడి కిరణాలు చొరబడి, నందీశ్వరుడి కొమ్ముల నడి భాగంలో ప్రవేశించి గర్భాలయం ముందున్న హుండీపై సూర్యుడి వెలుతురు నిమిషం పాటు పడి మాయమైంది. సూర్య కిరణాలు మూలవిరాట్టుపై పడకపోవడంతో భక్తులంతా తీవ్ర నిరాశ చెందారు. భక్తుల సంఖ్య అధికం కావటంవల్లే సూర్యకిరణాలు గర్భాలయంలోని మూలవిరాట్టును స్పృశించలేదని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

60 మంది రిటైర్డ్ టీచర్లకు సత్కారం

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఓఏ పాఠశాలకు చెందిన 60 మంది రిటైర్డ్ టీచర్లను విద్యార్థి బృందం సత్కరించింది. 1995లో ఈ స్కూలు నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు దేశవిదేశాల్లో స్థిరపడి ఉన్నతోద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. వీరంతా గతంలో ఫిలిప్పీన్స్‌లో జరిగిన 30వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. తమ జీవితాలను తీర్చిదిద్ది, తమ ఉన్నతికి, పాఠశాల ఉన్నతికి పాటుపడి, పదవీ విరమణ చేసిన గురువులను తాజాగా ఘనంగా సత్కరించారు.


సత్కార కార్యక్రమంలో గురువులు, శిష్యులు

సౌత్‌జోన్ స్పోర్ట్స్ స్టైఫండ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) సౌత్‌జోన్ స్పోర్ట్స్ స్టైఫండ్ కోసం ఉత్తమ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్‌సాహెబ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన పట్టణ, గ్రామీణ క్రీడాకారులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎఫ్‌సీఐ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించి, మార్చి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

- **బాలురు(15నుంచి 18 సంవత్సరాల వరకు):** ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్
- **బాలికలు(18నుంచి 24 సంవత్సరాల వరకు):** టేబుల్ టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 23 కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలతో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం : రూ.3.52 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 65,327

తలనీలాలు సమర్పించినవారు : 22,804





పరమశివుడి అరుదైన దివ్య రూప సందర్శనం నాగలాపురం మండలం సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో వీక్షించవచ్చు. శంకరుడు అన్నీ ఆలయాల్లోనూ లింగాకార రూపంలోనే దర్శనమిస్తాడు. ఇక్కడ మాత్రం పార్వతీ ఒడిలో 14 అడుగుల మానుష రూపంలో శివశయనమూర్తిగా అనుగ్రహమిస్తాడు. పార్వతీ సమేతంగా యోగనిద్రలో దర్శనమిచ్చే ఈ పరమేశ్వరుడుని దర్శించుకుంటే తమ కోరికలు శీఘ్రంగా నెరవేరుతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

- నాగలాపురం, ఆంధ్రజ్యోతి

యోగ నిద్రామూర్తి

సురుటుపల్లి పల్లికొండేశ్వరుడు

స్థల పురాణం

ఆలయానికి సంబంధించి స్థల పురాణం ఇలా ఉంది. దేవతలె అమృతంకోసం క్షీర సాగర మదనం చేసినప్పుడు పాల సముద్రం నుంచి కాలకూట విషం వెలువడుతుంది. లోక కళ్యాణార్థం శివుడు దానిని స్వీకరిస్తాడు. విషాన్ని గర్భంలోకి చేరకుండా పార్వతీ దేవి తమ పతి గొంతును నొక్కి పడుతుంది. దీంతో గొంతు భాగం నీలి రంగుగా మారుతుంది. అందుకే శివుడ్ని నీలకంఠుడంటారు. విష ప్రభావానికి లోనైన స్వామి భరించలేని తాపంతో పార్వతి ఒడిలో సేదదీరాడు. శివశయన మూర్తికి ఏర్పడిన స్థితికి చింతిస్తూ సకల దేవతలు వచ్చారు. ఆ రోజు త్రయోదశి మంగళవారం సాయంకాలం ప్రదోష వేళలో మహదేవుడు విషాహరణ దుస్థితిని వీడాడు. తన కమల నేత్రములను వికసింపజేసి గౌరీ సమేతంగా భక్తులకు అనుగ్రహించాడు. అందుకే క్షేత్రంలో ఆమె పేరు సర్వమంగళా దేవి. సురుటుపల్లి పల్లికొండేశ్వర క్షేత్రం ప్రదోష క్షేత్రంగా వాసికెక్కింది.



వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు...

ఆలయంలో ఏటా 10రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. దేవదాయశాఖ నిధులతో పాలకమండలి చైర్మన్, ఆలయ ఈవో నేతృత్వంలో చలువపందిళ్ళు, విద్యుత్ దీపాలంకరణలు, క్యూలైన్లు, తాగునీటి వసతులు, పుష్పాలంకరణ వంటివి ఏర్పాటు చేస్తారు. పల్లకి ఉత్సవం, చంద్రప్రభ వాహనం, కామధేను వు వాహనం, భూతవాహనం, అధికార నంది వాహనం, గజవాహనం, అశ్వవాహనం, వృషభ వాహనం, కల్ప వృక్ష వాహనం, రావణాసుర వాహనాల్లో స్వామిఅమ్మవార్లకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఈనెల 26న మహాశివరాత్రి పూజలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. అలాగే 15 రోజులకోసారి ప్రదోష వేళలో ప్రదోష మహానందికి అభిషేకాది పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తారు.

పేరిలా వచ్చింది..

విష్ణు బ్రహ్మాది సురులు వచ్చినందున సురులపల్లిగా పిలిచేవారు. కాలక్రమేనా సురుటుపల్లిగా మారింది. విజయనగరాధీశుడు హరి హర బుక్క రాయులు క్రీ.శ. 1344-47 లో ఆలయన్ని నిర్మించారు. పార్వతీ పరమేశ్వరులు ప్రదోష వేళలో సర్వలోకాలను అనుగ్రహించడం వలన ఈ దేవాలయం మహా ప్రదోష క్షేత్రంగా ప్రసిద్ధిగాంచింది.



పరీక్షా కాలం... ఆరోగ్యం ప్రధానం



- మంచి ఆహారం... నిద్ర తప్పనిసరి
- జాగ్రత్తలు సూచిస్తున్న నిపుణులు

విద్యార్థులకు పరీక్షల సమయం దగ్గర పడింది. ఇంటర్‌మీడియట్, పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. మార్చి 1 నుంచి ఇంటర్, 17 నుంచి పదవ తరగతి పరీక్షలు జరుగనున్నాయి. దీంతో రాత్రి, పగలు విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. రేయింబవళ్లు చదువుకే కేటాయిస్తున్నారు. సమయానికి ఆహారం, చాలినంత నిద్ర గురించి పట్టించుకోకుండా బిజీ అయిపోతున్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే అభ్యాసంతో పాటు ఆహారం, ఆరోగ్యం ప్రధానమని విద్యా నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఒత్తిడిని అధిగమిస్తేనే ఏకాగ్రతతో చదువు సాగించగలమని సూచిస్తున్నారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



నిద్రతో ఉపశమనం

అలసిన శరీరానికి నిద్ర ఉపశమనం కలిగిస్తుంది. చాలినంత నిద్ర మరో రోజుపాటు చదువుకోడానికి కావలసిన ఉత్సాహాన్నిస్తుంది. చాలినంత నిద్ర లేకుండా చదవడం అనారోగ్యానికి దారితీస్తుంది... ఏకాగ్రత లేకుండా చేస్తుంది. అందువల్ల రోజు 8 గంటలు నిద్ర ఉండేలా చూసుకోవాలి. ఎక్కువసేపు మేల్కొని చదివేందుకు కాఫీ, టీలు అతిగా తీసుకోవడం మంచిది కాదు. సోయాబీన్ పిండి కలిపిన మజ్జిగ తాగితే మంచి శక్తిని ఇవ్వడంతోపాటు పగటి నిద్రను నిరోధిస్తుంది. రాత్రి 10 గంటలసయంలో పాలు తాగితే ఆరోగ్యంతోపాటు నిద్రకూ ఉపకరిస్తుంది.



సాత్వికాహారం ఎంతో మేలు

చదివినవి బాగా గుర్తుండాలన్నా, ఏకాగ్రతగా చదవాలన్నా త్వరగా జీర్ణమయ్యే సాత్విక ఆహారం ఎంతో మంచిదని నిపుణులు చెబుతురు. సాత్వికాహారంలోనూ పరిశుభ్రత, సమతుల పోషక విలువలు ఉండేలా చూడాలి. నిర్దేశిత సమయమూ పాటించాలి. మసాలా ఆహారం దరిచేరనివ్వకూడదు. వీధుల్లో విక్రయించే ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీటిని రోజుకు నాలుగు లీటర్ల వరకు తీసుకోవాలి. అన్నం లేదా బార్లీ గంజిని సాయంత్రం వేళల్లో తీసుకోవడం మంచిది. విద్యార్థులు రోజుకు 300 మిల్లీ లీటర్ల కొబ్బరి నీరు, గ్లూకోజ్ నీరు, కొద్దిగా ఉప్పు కలిపిన మజ్జిగ వంటివి తీసుకోవడం ఉత్తమం. శీతల పానీయాలు తాగకూడదు. రోజుకు అరగంటైనా వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు.

పరిశుభ్రతతో ఉత్సాహం



శరీర, పరిసరాల పరిశుభ్రత ఉత్సాహాన్నిస్తుంది. చదువులో నిమగ్నమై స్నానం నిర్లక్ష్యం చేయకూడదు. శరీరం శుభ్రంగా ఉన్నపుడు మంచి మూడ్‌తో... చదివినది మెదడులో నిక్షిప్తమవుతుంది. అలసట వస్తే చల్లటి నీటితో ముఖం కడుక్కోవాలి. రెండు పూటలా స్నానం చేయాలి. లేదంటే చర్మం పొడిబారి చర్మవ్యాధులు వస్తాయి. దీనివల్ల ఏకాగ్రతకు భంగం కలుగుతుంది.

ఆహార నియమావళి



విద్యార్థులు ఇప్పటినుంచే ఆహార నియమావళి అలవరచుకోవాలి. మూడు పూటలా ఆహారం తీసుకోవాలి. ఏపూటా ఆహారాన్ని స్కిప్ చేయకూడదు. సమతుల ఆహారం తీసుకోవాలి. ఒమేగా 3 ఫాటీ యాసిడ్స్, విటమిన్ బి, జింక్ జ్ఞాపక శక్తిని పెంపొందిస్తాయి. రోజువారీ ఆహారంలో ఆకు కూరలు, కోడిగుడ్లు, పండ్లు, పిస్తా, ఆల్మండ్ తదితర నట్స్ ఉండేలా చూసుకోవాలి. పరిమితి మేరకు డార్క్ చాక్లెట్స్ తీసుకోవచ్చు... ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్ మెదడును ఉత్తేజితంగా ఉంచుతాయి. బార్లీ జావ మేలు చేస్తుంది.

- కేవీఆర్వీ ప్రసాద్‌రావు, డైటీషియన్, రుయా ఆసుపత్రి, తిరుపతి.

20 ఏళ్లుగా రూ.47లక్షల పన్ను బకాయిలు

వసూలుకు కొత్త మార్గం ఎంచుకున్న తంజావూరు కార్పొరేషన్

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తంజావూరులో 20 యేళ్లుగా రూ.47 లక్షల మేరకు పన్ను చెల్లించన బిజినెస్ మాల్ నిర్వాహకులకు కార్పొరేషన్ అధికారులు తగిన గుణపాఠం చెప్పారు. పన్ను వసూలుకు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. ఫలితంగా అప్పటికప్పుడు ఆ బిజినెస్‌మాల్ నిర్వాహకులు కార్పొరేషన్‌కు రూ.5లక్షల మేరకు బకాయిలు చెల్లించి, మిగతా త్వరగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. తంజావూరు శీనివాసన్ పిళ్లై రోడ్డులో బిజినెస్ మాల్ నడుపుతున్నారు. ఆ మాల్‌లో 80 దుకాణాలున్నాయి. ఆ మాల్ నిర్వాహకులు 20 యేళ్లుగా ఆస్తిపన్ను చెల్లించడం లేదు. సుమారు రూ.47 లక్షల మేరకు పేరుకుపోయాయి. కార్పొరేషన్ అధికారులు వందల సంఖ్యలో నోటీసులు జారీ చేసిన మాల్ నిర్వాహకులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం చెత్తాచెదారాన్ని లారీలో తీసుకెళ్లి మాల్ ముందర పోశారు. దీంతో ఉదయం నుంచి ఆ మాల్‌లోకి ఎవరూ వెళ్లలేకపోయారు. చెత్తకుప్పలను ఎవరూ తొలగించకుండా కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు కాపలాగా నిలిచారు. విషయం తెలుసుకున్న మాల్ నిర్వాహకులు అప్పటికప్పుడు రూ.5లక్షలు చెల్లించారు. దీంతో పారిశుధ్య కార్మికులు చెత్త తొలగించారు.


తంజావూరు బిజినెస్‌మాల్ ప్రవేశద్వారం వద్ద చెత్తకుప్ప

సినిమా స్కూల్‌కు త్రిష కుమార్తెతో కలిసి వెళతా

- హీరో కమలహాసన్

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సినిమా అనే స్కూల్‌కు హీరోయిన్ త్రిషతోనే కాదు ఆమె కుమార్తెతో కూడా కలిసి వెళతానని అగ్రనటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) అధ్యక్షుడు కమల్ హాసన్ సరదాగా వ్యాఖ్యానించారు. నగరంలో తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో కమల హాసన్‌తో కలిసి త్రిష కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'థగ్‌లైఫ్' మూవీలో కమల్‌తో కలిసి నటించిన అనుభవంపై త్రిష స్పందిస్తూ.. 'థగ్‌లైఫ్' చిత్రంలో నటించడం గొప్ప అనుభవంగా భావిస్తున్నాను. ఆయన వద్ద అనేక విషయాలు నేర్చుకున్నాను. కమల్‌తో కలిసి ఒక పాఠశాలకు వెళ్ళిన అనుభూతిని పొందాను. ఆ స్కూల్‌లో అనేక విషయాలు తెలుసుకున్నాను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమల్ స్పందిస్తూ.. 'నిజమే.. నేను త్రిషతో కలిసి స్కూల్‌కు వెళ్ళాను. అక్కడ అనేక విషయాలు నేర్చుకున్నాం. గురుస్థానం అనేది నాకొద్దు. అది దివంగత కె.బాలచందర్‌తోనే ఉండిపోనివ్వండి. నేను ఎల్లవేళలా ఒక విద్యార్థిగానే ఉండేందుకు ఇష్టపడతాను. త్రిషతో కలిసి స్కూలుకు వెళ్ళాను. ఆ తరువాత ఆమె కుమార్తెతో కూడా పాఠశాలకు వెళతాను. సినిమా అనేది చాలా పెద్దది. నేను 5వ తరగతి వరకు మాత్రమే నేర్పించగలను. పీహెచ్‌డీ స్థాయికి నేను నేర్పించలేను. సినిమా అనేది అనేక విషయాల సమ్మేళనం' అని పేర్కొన్నారు.



వన్యప్రాణులకు నీటి సరఫరా

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ముదుమలై, మసినకుడి గార్డెన్ ప్రాంతాల్లో కరువు నెలకొనడంతో, వన్యప్రాణుల తాగునీటి అవసరాలకు తీర్చేలా అటవీ శాఖ అధికారులు వాహనాల్లో నీరు తీసుకెళ్లి కుంటల్లో నింపుతున్నారు. ముదుమలై పులుల శరణాలయం, ముదుమై మసినకుడి ప్రాంతాల్లో వన్యప్రాణులు అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో చెట్లు, కుంటలు ఎండిపోయి దర్శనమిస్తుండగా, వన్యప్రాణులకు ఆహారం, తాగునీటి కొరత ఏర్పడింది. దీంతో, వన్యప్రాణులు సమీపంలోని గ్రామాల్లోకి వెళ్లి ఆహారం వెతుక్కుంటున్నాయి. దీంతో, ఆయా ప్రాంత ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై దృష్టి సారించిన అటవీ శాఖ, అటవీ ప్రాంతాల్లోని కుంటల్లో వాహనాల ద్వారా నీరు నింపే పనులు చేపట్టింది.


నీటితో కుంటను నింపుతున్న అటవీ సిబ్బంది

అయిష్టంగానే రాజకీయాల్లోకి వచ్చా

- దురై వైగో ప్రకటన

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పార్టీ శ్రేణులు బలవంతం చేయడం వల్లే తాను రాజకీయాల్లోకి వచ్చానని ఎండీఎంకే ముఖ్య కార్యదర్శి దురై వైగో అన్నారు. మదురైలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు పరిచేందుకు తప్పుడు మార్గాలను ఎంచుకుందన్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. జాతీయ విద్యావిధానాన్ని అమలు చేస్తేనే నిధులిస్తామని బెది రించడం భావ్యమేనా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలంతా ఆలోచించి కేం ద్రానికి గుణపాఠం చెప్పాలన్నారు. రాజకీయాల్లో తాను ఇంకా ఎన్నో విష యాలు నేర్చుకోవాల్సి ఉందని, ఎంపీగా ప్రజలకు సేవలందిస్తున్నానని తెలిపారు.

కార్గో విమానం అత్యవసర ల్యాండింగ్

అడయార్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో అక్కడ దిగాల్సిన ప్రైవేటు విమానయాన సంస్థకు చెందిన కార్గో విమానాన్ని దారి మళ్ళించి, చెన్నై విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేయించారు. బెంగళూరు ఎయిర్‌పోర్టులో శనివారం వేకువజామున దట్టమైన పొగమంచు కురిసింది. ఆ సమయంలో అక్కడ ల్యాండ్ కావాల్సిన పలు విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. కొన్ని విమానాలను చెన్నై, కోయంబత్తూరు, తిరువనంతపురం ఎయిర్‌పోర్టులకు దారి మళ్ళించారు. ఈ క్రమంలో ఉదయం 7 గంటలకు బెంగళూరుకు చేరుకున్న బ్లూడార్ట్ కార్గో విమానం ల్యాండ్ కాలేకపోయింది. దీంతో ఆ విమానాన్ని చెన్నైకు మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేయించారు. అదేవిధంగా పుణె, కోల్‌కతా, ముంబై తదితర ప్రాంతాల నుంచి బెంగళూరుకు వచ్చిన విమానాలను కూడా ల్యాండింగ్ చేయడంతో ఇబ్బందులు తలెత్తాయి.

బాలికతో పెళ్లి... యువకుడికి 20 ఏళ్ల జైలు

- పుదుచ్చేరి పోక్సో కోర్టు తీర్పు

పుదుచ్చేరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బాలికను వివాహం చేసుకున్న యువకుడుకి 20 యేళ్ల జైలుశిక్ష విధిస్తూ పుదుచ్చేరి పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. తాజాగా వెల్లడైన ఈ తీర్పు వివరాలను పరిశీలిస్తే, విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలోని కాయత్తర్‌కి చెందిన జానకిరామన్(31) 2019లో పుదుచ్చేరికి చెందిన బాలికను పెద్దల అనుమతితో వివాహం చేసుకున్నాడు. పెళ్లి అంశం పోలీసుల దృష్టికి వెళ్ళడంతో వారు ప్రాథమికంగా విచారణ చేపట్టారు. ఆ తర్వాత జానకిరామన్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ పుదుచ్చేరి పోక్సో కోర్టులో సాగింది. ఈ కేసులోని సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి సుమతి.. నిందితుడు జానకిరామన్‌ను దోషిగా నిర్ధారిస్తూ 20 యేళ్ళ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే, బాలిక తండ్రి, పిన్ని, జానకి రామన్ తండ్రి కృష్ణమూర్తి, తల్లి లక్ష్మిలకు కూడా రెండేళ్ళ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రూ.45లక్షల విలువైన వెండి స్వాధీనం

- రహదారిపై తనిఖీల్లో పట్టివేత
- సీసీఎస్ పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

వెంకటాచలం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా వెంకటాచలం మండల పరిధిలోని వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద సుమారు రూ.45 లక్షల విలువైన 42 కేజీల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల మేరకు.. కోల్‌కత్తా - చెన్నై జాతీయ రహదారిపై వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద శనివారం నెల్లూరు సీసీఎస్ సీఐ సీతారామయ్య ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న ఏపీ39ఎన్‌క్యూ4388 నెంబరు గల కారును తనిఖీ చేయగా అందులో ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 42 కేజీల వెండిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న వెండి విలువ బహిరంగ మార్కెట్ ప్రకారం సుమారు రూ.45 లక్షలకుపైగానే ఉంటుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్న వెండి, కారు

రైలు ఢీకొని రైల్వే ఇంజనీర్ దుర్మరణం

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొనటంతో తిరువొత్తియూరుకు చెందిన రైల్వే ఇంజనీర్ త్యాగరాజన్ (33) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... ఎన్నూరు రైల్వేసెక్షన్‌లో పనిచేస్తున్న ఆయన శనివారం ఉదయం పొన్నేరి - కవరపేట రైల్వేస్టేషన్ల నడుమ ఇద్దరు సిబ్బందిని వెంటబెట్టుకుని రైలు పట్టాల పటిష్టతను పరిశీలిస్తున్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో త్యాగరాజన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తక్కిన ఇరువురూ గాయపడ్డారు. కొరుక్కుపేట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పొన్నేరి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సాయంత్రం 6గంటల ప్రాంతంలో పోస్టుమార్టం ముగిసిన తర్వాత మృతదేహాన్ని త్యాగరాజన్ భార్య ఇందుమతికి అప్పగించారు. ఇందుమతి చెన్నై ఎగ్మూరులో రైల్వే ఉద్యోగి. ఈ దంపతులకు ఐదు నెలల కుమార్తె తనిష్క ఉంది. త్యాగరాజన్ 2020లో ఉద్యోగంలో చేరారు.


ఆస్పత్రిలో త్యాగరాజన్ భౌతికకాయం

బనియన్ల కంపెనీ మేనేజర్ దారుణహత్య

బంధువు అరెస్టు

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా అవినాశి సమీపంలో కరువలూరు అనంతగిరికి చెందిన బనియన్ల కంపెనీ మేనేజర్ గోవిందసామి (54) దారుణహత్యకు గురయ్యాడు. ఈ కేసుకు సంబంధించి ఆయన బంధువైన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 19న ఇంటి నుంచి కంపెనీకి వెళ్లిన గోవిందసామి తిరిగి రాలేదు. ఆయన ఆచూకీకోసం అన్ని చోట్లా వెదికిన కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని గోవిందసామి చిన్నాన్న కుమారుడు రమేష్‌ను విచారించగా పొంతన లేని సమాధానాలిచ్చాడు. ఆ తర్వాత అతడిని స్టేషన్‌కు తీసుకెళ్ళి పోలీసులు విచారణ జరిపినప్పుడు గోవిందసామిని హత్యచేసింది తానేనని అంగీకరించాడు. ఆస్తి తగాదాల నేపథ్యంలోనే గోవిందసామిని హత్యచేసి మృతదేహాన్ని ముక్కలుగా చేసి అట్టపెట్టెలో తొరవలూరు సమీపంలో కొలనులో పారవేసినట్లు తెలిపాడు. శనివారం ఉదయం అగ్ని మాపక దళం సహాయంతో కొలను నుంచి ముక్కలుగా ఉన్న గోవిందసామి మృతదేహాన్ని వెలికి తీశారు.